రేపు అరసవల్లి హుండీ లెక్కింపు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీలను నవంబరు నాలుగో తేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగ సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు.

అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

జీడికి మద్దతు ఎందుకు ఇవ్వరు?

పంటలకు గిట్టుబాటు ధర కల్పనలో కేరళ ఆదర్శం

సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్

మందసలో ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ప్రారంభం

సమస్యలు వింటూ భరోసా కల్పిస్తూ సాగిన యాత్ర

అడు గడుగునా ఘన స్వాగతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్, పలాస, టెక్కలి రూరల్, కోటబొమ్మాళి

మాట్లాడుతున్న విజూ కృష్ణన్

జిల్లాలో జీడి పంట పండిస్తున్న రైతులకు మద్దతు ధర ఎందుకు ఇవ్వరని సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను మందసలో గురువారం ఆయన ప్రారంభించారు. తొలి రోజు యాత్ర మందస, పలాస, టెక్కలి, కోటబొమ్మాళి మీదుగా శ్రీకాకుళం చేరుకుంది. ఈ సందర్భంగా మందస, శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన బహిరంగ సభల్లో విజూ కృష్ణన్ ముఖ్య వక్తగా మాట్లాడారు. విశాఖలో కాఫీ రైతులకు, జిల్లాలో జీడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. జీడి పంటకు మద్దతు ధర విషయంలో కేరళ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. జీడి పంట ఉత్పత్తి, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వరికి క్వింటాకు రూ.2,850 చెల్లిస్తోందని చెప్పారు. కేరళలో 16 రకాల కూరగాయలకు బేసిక్ ధర నిర్ణయించిందని తెలిపారు.

బస్సు యాత్రకు మద్దతుగా నిలవాలి

జీడి రైతులను వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. జీడి, కొబ్బరి పంటల కోసం బోర్డు ఏర్పాటు చేయాలని చాలా కాలంగా రైతులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. మహేంద్రతనయ నీళ్ల సముద్రంలో కలుస్తున్నా

తొలి రోజు 210 కి.మీ మేర సాగిన యాత్ర

మందసలో ప్రారంభమైన తొలి రోజు బస్సు యాత్ర పలాస, టెక్కలి, కోటబొమ్మాళి మీదుగా శ్రీకాకుళం చేరుకుంది. ఏడు రోడ్ల కూడలి వద్ద సభ నిర్వహించి తొలి రోజు యాత్ర ముగించారు. సుమారు 210 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది.

ప్రాజెక్టులు నిర్మించకపోవడంతో, వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. వంశధార ప్రాజెక్టుతో జిల్లాను సస్యశ్యామలం చేస్తున్నామంటూ వైసిపి, టిడిపి మాటలు చెప్తున్నాయి తప్ప పని జరగలేదు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన బస్సు యాత్రకు అంతా మద్దతుగా నిలవాలి.

- కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ప్రజావసరాలు తీర్చడంలో విఫలం

శ్రీకాకుళం నగర ప్రజల అవసరాలను తీర్చడంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు విఫలమయ్యారు. మున్సిపాలిటీని నగరపాలక సంస్థగా స్థాయి పెంచినా, మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం ధర్మానకు చిత్తశుద్ధి లేదు. కార్పొరేషన్‌గా బోర్డు మార్చినంత మాత్రాన ప్రజల జీవన స్థితి మెరుగుపడదు. రోడ్లు, కాలువలు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలి. పౌర సేవా సంఘం ఆధ్వర్యాన ప్రజలతో కలసి ఈ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం.

- బి.తులసీదాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

అడుగడుగునా ఘన స్వాగతం

బస్సు యాత్ర బృందానికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. తొలుత మందస ప్రాంతానికి చేరుకున్న బృందం వీరగున్నమ్మ స్థూపానికి నివాళి అర్పించారు. మందస హైస్కూల్ నుంచి భారీ ప్రదర్శన చేపట్టారు. డప్పు కళాకారుల వాయిద్యాలతో స్వాగతం పలికారు. తప్పెట్లగుళ్ల ప్రదర్శించారు. శ్రీకాకుళం మండలం పెద్దపాడు జాతీయ రహదారి కూడలికి చేరుకున్న బస్సు యాత్ర బృందానికి పెద్దసంఖ్యలో ప్రజాసంఘాల నాయకులు ఎదురెళ్లి నగరంలోకి స్వాగతించారు. అనంతరం అక్కడ నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్దకు చేరుకున్నారు.

పాలకుల వైఫల్యం వల్లే వలసలు

వైసిపి, టిడిపి ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధినివిస్మరించాయి. దాని ఫలితంగా ఈ ప్రాంతం నుంచి గుజరాత్, ముంబయి ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. విశాఖ రైల్వే జోన్, ఈ ప్రాంతానికి గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాకు నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది. ఈ ప్రాంతానికి ద్రోహం చేసిన బిజెపిని, ఆ పార్టీకి మద్దతు పలుకుతున్న వారిని ఓడించాలి. ప్రత్యామ్నాయ విధానాలు, రాజకీయ ప్రణాళికను ప్రజల ముందు ఉంచేందుకు విజయవాడలో ఈనెల 15న నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో రావాలి.

- మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సమస్యలు వింటూ.. భరోసానిస్తూ...

తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని బస్సు యాత్ర బృందానికి రైతులు, గిరిజనులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు వినతిపత్రాలు అందించారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని జీడి రైతులు వినతిపత్రం ఇచ్చారు. తమ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు, పాఠశాలల విలీనం సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని సిపిఎం నాయకులు హామీనిచ్చారు.

చిలకపాలెంలో నేడు బహిరంగ సభ

బస్సు యాత్ర రెండో రోజు ఎచ్చెర మండలం చిలకపాలెంలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కానుంది. చిలకపాలెం కూడలిలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. అనంతరం బస్సు యాత్ర విజయనగరం బయలుదేరుతుంది.

అసమానతల్లేని అభివృద్ధి కావాలి

అసమానతల్లేని అభివృద్ధి కావాలి. రాష్ట్రంలో కరువు మండలాలు చాలా ఉండగా, 103 మండలాలను ప్రకటించి కాకిలెక్కలు చెప్తున్నారు. జిల్లాలో ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించలేదు. రైస్‌మిల్లుల్లో, గ్రానైట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.25 వేలు కనీస వేతనం చెల్లించాలి. కరెంట్ ఛార్జీలు పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు రూ.ఐదు వేలు అందించాలి.

- ఎ.వి నాగేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, నాయకులు కె.నాగమణి, వి.జి.కె మూర్తి, ఎన్.షణ్ముఖ రావు, ఎన్.గణపతి, తెప్పల అజయ్‌కుమార్, పాతిన క్రిష్ణమూర్తి, ఆర్.దిలీప్ కుమార్, గోపి, ఎం.ధర్మారావు, కొల్లి ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పెటగుళ్లు ప్రదర్శనకు దరువేస్తున్న విజూ కృష్ణన్, లోకనాథం

శ్రీకాకుళం అర్బన్ : సభలో పాల్గొన్న ప్రజల్లో ఒక భాగం

పనులను పరిశీలిస్తున్న కె.సి రెడ్డి

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) ఛాన్సలర్ కె.సి రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ట్రిపుల్ ఐటిలో రూ.3.60 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు పనులను గురువారం పరిశీలించారు. విద్యార్థులకు వసతి సదుపాయాల నిమిత్తం ఎచెర్లలో కొత్తగా నిర్మిస్తున్న వసతి భవనాల పనులను పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దన్నారు. ల్యాబ్ భవనం పనులను పరిశీలించి అత్యాధునికంగా, త్వరగా నిర్మాణ పనులు చేయాలన్నారు. 250 కెవి జనరేటర్‌ను ప్రారంభించారు. రూ.2.62 కోట్ల వ్యయంతో నూతనంగా చేపడుతున్న అదనపు వసతి భవన పనులను పరిశీలించి చేపడుతున్న పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఒఎస్‌డి ఎల్.డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఇఇ తమ్మిరెడ్డి, డిఇ వెంకటరెడ్డి, డిప్యూటీ ఎఒ రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా కేసుల దర్యాప్తు

ప్రజాశక్తి - నరసన్నపేట

సమగ్రంగా కేసుల దర్యాప్తు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌ను అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. గత నెలలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, బోర్డర్ పోలీసు స్టేషన్లు, కేసుల నమోదు, దర్యాప్తు తదితర వాటిని నరసన్నపేట సిఐ అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఎం.లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి నగదు చెక్కును అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ సతీమణి ఎం.జ్యోతి, కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆడిషనల్ విడో, ఫ్లాగ్ ఫండ్ రూపంలో రూ.75 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, పరిపాలనాధికారి సిహెచ్.గోపీనాథ్, ఆర్‌ఐ డి.సురేష్, బి సెక్షన్ సూపరింటెండెంట్ వై.లిల్లీభాయ్ పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఉపాధి హామీ ద్వారా రోడ్లకు ఇరువైపులా, చెరువుగట్లపై, రైతుల పొలాల్లో నాటే ప్రతి మొక్కను బతికించుకోవాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించే విధంగా పనులు గుర్తించి నివేదికలు తయారు చేయాలన్నారు. గ్రామంలో కమ్యూనిటీ సోప్‌పిట్లు, గ్రామ సచివాలయాలు, పాఠశాలలల్లో రూఫ్‌టాప్ తదితర వాటిని గుర్తించి ప్రతిపాదనలు చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో హెచ్‌ఆర్ మేనేజర్ పి.శ్రావణ్ కుమార్, ఎపిఒలు బి.వాసునాయుడు, అరుణ్‌కుమార్, జిఇలు జి.హరిప్రసాద్, మునేంద్ర, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులి జాడ మళ్లించేందుకు చర్యలు

అటవీశాఖ రేంజర్ మురళీకృష్ణ

ప్రజాశక్తి - పలాస, సోంపేట

సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోకి పెద్దపులి వచ్చినట్లు గుర్తించామని అటవీశాఖ కాశీబుగ్గ రేంజర్ మురళీకృష్ణ తెలిపారు. పెద్దపులి జాడ మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కాశీబుగ్గలోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద పులి ప్రస్తుతం ఉద్దాన ప్రాంతంలో సంచరిస్తోందన్నారు. ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి తోటల్లో ఆవులను కట్టి ఉంచడం ద్వారా పెద్ద పులి వాటిని చంపేస్తోందన్నారు. సకాలంలో ఆహారం దొరకడం ద్వారా బయటకు వెళ్లకుండా ఉద్దాన ప్రాంత తోటల్లోనే సంచరిస్తోందని తెలిపారు. దాని జాడ మళ్లించేందుకు ఆవులు, ఇతర పశువులను గ్రామానికి సమీపంలోని శాలల్లో కట్టి ఉంచాలన్నారు. సాయంత్రం 5.30 తర్వాత, ఉదయం ఆరు గంటల ముందు ఆరు బయట విచ్చలవిడిగా తిరగరాదని సూచించారు. పులి అడుగుజాడలను అనుసరించి ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ఇటీవల ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల్లో పెద్దపులి సంచరించిందని, పలాస మండలం లొత్తూరులోకి ప్రవేశించినట్లు తొలిసారి గుర్తించామన్నారు. పెద్దపులికి సకాలంలో ఆహారం అందుకుండా చూడగలిగితే బయటకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకనుగుణంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

సోంపేట మండలం కర్తలిపాలెంలోని బత్తిన రామస్వామికి చెందిన పాడి ఆవును బుధవారం అర్ధరాత్రి పెద్ద పులి దాడి చేసి చంపేసింది. బాధిత రైతు, అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రామస్వామి ఎప్పట్లాగే తన ఆవులను ఇంటి సమీపంలో కట్టి ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి పెద్దపులి అందులో ఒక ఆవుపై దాడి చేసి, ఈడ్చుకుంటూ సమీపంలోని తోటల్లోకి తీసుకెళ్లి చంపేసింది. గురువారం ఉదయం రామస్వామి చూసేసరికి ఆవులు కట్టిన ప్రాంతమంతా చెల్లాచెదురుగా ఉండడం, ఒక ఆవు లేకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. సమీప తోటలో ఆవు కళేబరంతో పాటు చుట్టుపక్కల పులి పాదముద్రలు కనిపించడంతో వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ అధికారులు, పశువైద్యాధికారి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆవుపై పులి దాడి చేసినట్లు నిర్ధారించి, పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు చేశారు. పరిశీలనలో అటవీ శాఖ అధికారులు కృష్ణంనాయుడు, రాజేంద్ర, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిఎంకు కరువు కనిపించడం లేదా?

- 160 స్థానాల్లో గెలుపు ఖాయం
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలో కరువుఛాయలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కనిపించడం లేదా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. వర్షాభావం, ప్రభుత్వ వైఫల్యంతో ప్రాజెక్టుల సాగునీరు అందక పంటలు ఎండిపోతే కంటితుడుపు చర్యగా ఏడు జిల్లాల్లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని ధ్వజమెత్తారు. కాశీబుగ్గలోని ఒక కళ్యాణ మండపంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన వైసిసి అసమ్మతి నాయకులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరితో పాటు 25 మంది వైసిపి నాయకులు, 150 మంది కార్యకర్తలు టిడిపిలో గురువారం చేరారు. అచ్చెన్నాయుడు వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరి పంట పూర్తిగా పాడైనా జిల్లాలోని ఇద్దరు మంత్రులు, స్పీకర్ కరువు జిల్లాగా ప్రకటించుకోలేకపోయారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటిస్తామని హామీనిచ్చారు. వచ్చే ఎన్నికల తర్వాత జగన్‌కు జీవితాంతం చిప్ప కూడు తప్పదన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అవినీతి చేశాడని చెప్తున్న వైసిపి నాయకులు ఒక్క రూపాయి అయినా ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు.

హేంబాబు చౌదరికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

అప్పలరాజు జైలుకెళ్లడం ఖాయం

వైసిపి పాలనలో రాష్ట్రం 50 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 160 స్థానాల్లో టిడిపి గెలుపు ఖాయమన్నారు. పాల వెల్లువ పథకంలో రూ.రెండు వేల కోట్ల అవినీతికి పాల్పడినట్లు వార్తలు వస్తున్నాయని, ఇదే నిజమైతే పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును జైలుకు పంపడం ఖాయమన్నారు. పలాసలో భూ కబ్జాలు చేయడం తప్ప ఆయన ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు ఇవ్వలేకపోయారని ధ్వజమెత్తారు. పలాసలో వైసిపి నాయకులు టిడిపిలో చేరేందుకు టచ్‌లో ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి సీదిరి అప్పలరాజు సీటు ఖాళీ కావడం తథ్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గౌతు శిరీషను గెలిపించకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ మంత్రి గౌతు శివాజీ, ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస, పొందూరు

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలంలో చింతలపేట, దండేవలస, బొబ్బిలిపేటలో పొందూరు మండలం ధర్మపురం, పిల్లలవలసలో జల జీవన్ మిషన్ పథకం కింద మంచినీటి కుళాయిల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. బొబ్బిలిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి అనుసంధానంగా 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ను నియమించి ప్రజల వద్దకే పాలనను అందిస్తున్నారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని కొనియాడారు.

గత టిడిపి ప్రభుత్వం వలె జన్మభూమి కమిటీలు లేవని దళారులు అంతకంటే లేరన్నారు. నేరుగా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పొందూరు జెడ్‌పిటిసి ఎల్.కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, సర్పంచ్ మొదలవలస పాపారావు, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, జి.నాగరాజు, జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన సూరపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురంలో కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పోస్టల్ సూపరింటెండెంట్‌గా శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పోస్టల్ సూపరింటెండెంట్‌గా పి.శ్రావణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన్ను నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ సమస్యలు, కాలం చెల్లిన కంప్యూటర్లు, ప్రింటర్లను మార్చాలని ఆయన్ను కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన్ను కలిసిన వారిలో సంఘ జిల్లా నాయకులు యు.వి రమణ, గణపతి, వెంకటేష్, నందికేశ్వరరావు, పాత్రో, చంద్రమోహన్ తదితరులున్నారు.

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన **ఈరోతు లక్ష్మి ప్రసాద్** S/o ఈరోతు కేశవరావు కి చెందిన పాస్ పోర్ట్ నెంబర్ P5223854 సన్యాసిపుట్టుగ గ్రామం నుంచి కవిటి బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల ఈరోతు లక్ష్మి ప్రసాద్ గానీ కవిటి పోలీస్ స్టేషన్లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

Cell : 9701351955

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న 'గరిమెళ్ల' వారసులు

'గరిమెళ్ల' వారసులు ప్రియాగ్రహారం సందర్శన

ప్రజాశక్తి- పోలాకి

ప్రజా కవి, స్వతంత్ర సమరయోధులు గరిమెళ్ల సత్యనారాయణ జన్మించిన ప్రియాగ్రహారాన్ని మేనల్లుడు డాక్టర్ ఐ.వి.ఆర్.కె. మనవడు వై.లక్ష్మణరావు గురువారం సందర్శించారు. ప్రియాగ్రహారంలోని గరిమెళ్ల విహార్, గరిమెళ్ల పేరున ఉన్న కళాశాల, పాఠశాలను పరిశీలించారు. ముందుగా సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరిమెళ్ల ట్రస్టు ప్రధాన కార్యదర్శి బాడాన రాజు అధ్యక్షతన వారు మాట్లాడారు. గరిమెళ్ల వారసులను సత్కరిస్తున్నామని అన్నారు. గరిమెళ్ల స్వగ్రామాన్ని ఒక స్మారక స్మృతి చిహ్నంగా ప్రభుత్వం తీర్చిదిద్దాలని కోరారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్ర అధ్యక్షులు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ జాతి మరిచిన జాతి రత్నం గరిమెళ్ల అని అన్నారు. రాజు మాట్లాడుతూ తపాలా శాఖ సౌజన్యంతో గరిమెళ్ల సత్యనారాయణ పేరిట త్వరలో ప్రత్యేక తపాలా ముద్రికను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావు, గౌరవ సభ్యులు గణపతిరావు, భాను, గౌరవ సభ్యులు ఐ.గణపతిరావు, దుబ్బ కోటేశ్వరరావు, రగుతు మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు కేసులతో విపక్షాలపై వేధింపులు

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాజీ సిఎం చంద్రబాబు అవినీతి ఇంతవరకు ఎటువంటి ఆధారాలు చూపించలేక పోయిన వైసిపి ప్రభుత్వం పాలనను గాలికొదిలేసి విపక్షాలపై కక్షసాధింపుతో కాలక్షేపం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నాలుగున్నరేళ్లలో తప్పుడు కేసుల్లో ఎంతో మంది టిడిపి నాయకులను అరెస్టు చేసి ఎటువంటి ఆధారాలూ చూపించలేకపోయిందని అన్నారు. వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకుని తప్పుడు విధానాలతో పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా టిడిపికి ప్రజలు అండగా ఉంటారని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మండలం తెలుగు యువత ఉపాధ్యక్షులు ముద్దాడ అసిరినాయుడు, తెలుగు యువత కార్యదర్శి ఎండు లక్ష్మణ, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: మండలంలోని కేశపురానికి చెందిన శివంగి కూర్మారావు, భూలక్ష్మి దంపతులకు చెందిన హర్షిత, హర్ష కవలపిల్లలు, అందులో హర్ష అనే బాలుడు అంతుపట్టని వింత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతుండడంతో డిఎస్‌సి-2018 తెలుగు సేవా సమితి టీచర్స్ ఆధ్వర్యాన డొంకూరు జిల్లా పరిషత్ విద్యార్థులు రూ.16 వేలు వసూలు చేశారు. దీనిని హెచ్‌ఎం ఎం.సరోజని, ఉపాధ్యాయులు జి.శంకరరావు, కమలాకర్, వజీర్, వెంకటేశ్వర్‌లు బాలుడు కుటుంబ సభ్యులకు గురువారం నగదును అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం స్వాతి, నూకయ్య, శ్రీహరి, లక్ష్మి, ఎల్.గోవిందరావు, సువర్ణ, లోకనాథం పాల్గొన్నారు.

'గిడుగు' రీడింగ్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉన్నత ఉద్యోగాలకు సంసిద్ధులయ్యే వారంతా ఇకపై విజయనగరం, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. దీనిపై జిల్లాకు చెందిన యువతకు ఇచ్చిన హామీ నెరవేర్చుతున్నట్లు ప్రకటించారు. ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గొంటి వీధిలో ఉన్న విద్యార్థి డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి రీడింగ్ రూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు చెందిన నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సరైన వసతులు లేవని గుర్తించామన్నారు. పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో ప్రతిభ ఉన్నా, ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ లోటు భర్తీ చేస్తామని ఎర్రన్న విద్యాసంకల్పం పుస్తకాలు పంపిణీ చేసిన రోజు ప్రకటించానని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం హామీ నిలబెట్టుకుంటున్నానని వెల్లడించారు. పూర్తి ఎసి, విశాలమైన గదులు, మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ రీడింగ్ రూమ్ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. యువతీ, యువకులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఈ స్టడీ రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి నాయకులు జామి భీమశంకర్, మాదారపు వెంకటేష్, ఎస్.వి.రమణ మాదిగ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

పరమేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఇందిరా విజ్ఞాన భవనంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా పేడాడ పరమేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పూర్వ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి సాదరంగా ఆహ్వానించి బాధ్యతలను అప్పగించారు. అనంతరం పరమేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి పక్షాన పోరాడేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణాత్మక అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. పార్టీలో ప్రతి కార్యకర్త అభిప్రాయాన్ని గౌరవిస్తామని అన్నారు. ప్రధానంగా రైతాంగానికి సాగు నీరందించడంలో ప్రస్తుతం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణ రావు, కోత మధుసూదనరావు, కొర్ల హేమారావు చౌదరి, దుప్పట్ల మధుసూదనరావు, దేశెల్ల గోవిందమల్లిబాబు, రెల్ల సురేష్, కెవిఎల్ఎస్ ఈశ్వరి పాల్గొన్నారు.

పరమేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యవతి

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 8న విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదిస్తూ ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో విద్యార్థి యువజన సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యాన గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సిపిఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాలిన నారాయణ స్వామి, నాయకులు చాపర వెంకటరమణ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి, తెలుగు యువత అధ్యక్షులు జయదేవ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సంతోష్, జనసేన నాయకులు హరి, హేమ చలపతిలు మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. అలాంటి ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ను ప్రయివేటీకరించేందుకు ముందుకు సాగుతుందని అన్నారు. వీరుల త్యాగఫలం కారణంగా విశాఖ ఉక్కు నిర్మాణం సాధ్యమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కానీ, ప్రభుత్వ ఆస్తులను అమ్మకం చేయడం అన్యాయం అన్నారు. కరోనా వేళలోనూ దేశానికి సేవలందించిన ఘనత విశాఖ ఉక్కు ప్లాంట్‌కు సొంతమన్నారు. ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయకుండా అందరి కృషితో కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలూ స్వచ్ఛందంగా బందును ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు ప్రసాద్, వైకుంఠరావు, కృష్ణ, జనసేన నాయకులు భాస్కర్, కిషోర్, సిపిఐ నాయకులు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో తీవ్ర వర్షాభావం వల్ల రైతాంగం తీవ్ర కరువు బారిన పడ్డారని, నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి పూర్తిస్థాయిలో ఆదుకోవాలని సభ్యులంతా ఏకగ్రీవంగా కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వంశధార ద్వారా కాలువ దిగు ప్రాంతాలకు కనీసం సాగునీరు సరఫరా జరగలేదని అన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఉన్న దృష్ట్యా విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పేరాడ భార్గవి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, బాలక మధుసూదనరావు, ఎంపిడిఒ శివప్రసాద్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సభ్యులు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విలియమ్స్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన కొన్న చిన్నారావు మెమోరియల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బి.సునీత బంగారు, ఎస్.జోషిత వెండి పతకాలు సాధించారని అన్నారు. అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో 9వ తరగతి చదువుతున్న ఆర్.ఢిల్లేశ్వరి కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారిని తయారు చేసిన పీడీ పాండవుల జగదీష్‌ని అభినందించారు.

గ్రామకంఠం భూములను గుర్తించాలి

బూర్జ : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ప్రతి గ్రామంలోనూ గ్రామకంఠ భూములను గుర్తించాలని ఎంపిడిఒ రవీందరబాబు, తహశీల్దార్ రమణారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల్లోగా గుర్తించి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఇంటర్ విద్యార్థి మృతి

శివయ్య (ఫైల్)

ఇచ్ఛాపురం : మండలంలోని ముచ్చింద్రికి చెందిన సాడి శివయ్య (17) ఇంటర్ విద్యార్థి రైల్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. శివయ్య పురుషోత్తంపురంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్నారు. గురువారం స్కూల్ సమీపంలోని రైలు పట్టాలపై శివయ్య మృతిదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ప్రమాదమా? ఆత్మహత్య అనేది తెలియ రాలేదు. దీంతో గ్రామంలో స్కూల్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి తండ్రి కోయిరాడ ఉన్నారు.

నలుగురికి గాయాలు

నందిగాం : మండలంలోని పెద్దబాణాపురం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్దణానాపురం చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు పలాసలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదుకునేందుకు వెళ్తున్నారు. పెదబాణాపురం వద్దకు వచ్చేసరికి శ్రీకాకుళం వైపు నుంచి వస్తున్న టాటా మ్యాక్సీ సడన్ బ్రేక్ వేసి ఆటో బాగాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కొండల వెంకట తరుణ్, కింతల హేమ కుమారి, హారికల, ఆటో డ్రైవర్ కొండల మురళిలు గాయపడ్డారు. వీరికి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిఎంతో కృపారాణి, అన్వేష్

సిఎంను కలిసిన కృపారాణి

టెక్కలి రూరల్: విశాఖపట్నం ఐసిఐడి సదస్సుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కేంద్ర మాజీ మంత్రి, వైసిపి నాయకులు కిల్లి కృపారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో అదికారంలోకి వచ్చేందుకు పనిచేయాలని సిఎం ఆమెకు సూచించారు.

అన్వేష్...

ఇచ్ఛాపురం : విశాఖపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. దీంతో క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో క్రిష్టియన్ మైనారిటీలు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించారని అన్వేష్ తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న బాలకృష్ణ

నేడు రక్తదాన శిబిరం

సోంపేట: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బారువ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రక్తదానంపై అవగాహన కల్పించారు. శుక్రవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ రూ.3 లక్షల వ్యక్తిగత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆధార్, పాన్ కార్డు, ఫోన్ నంబర్లను వెంట తీసుకుని రావాలని సూచించారు.

జలాభిషేకంలో పాల్గొన్న మహిళలు

కపాసుకుద్దిలో జలాభిషేకం

కవిటి: మండలంలోని కపాసుకుద్దిలో రామలింగేశ్వర ఆలయంలో యాత్రికులు గురువారం జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు లేక పంటలు ఎండిపోవడం, రైతాంగం నిర్వీర్యం కావడం, మూగజీవాలకు నీరు లేకపోవడంతో ఈ జలాభిషేకం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ స్వామి, నిరంజన్ స్వామి ఆధ్వర్యాన 1108 బిందెల నీటితో రామలింగేశ్వరునికి అభిషేకం నిర్వహించారు.

విద్యుత్ భద్రతపై అవగాహన

మెళియాపుట్టి : మెళియాపుట్టి సబ్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యాన గురువారం విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. సబ్‌స్టేషన్ నుంచి చాపర వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతినెలా 2న ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా సబ్ స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞన చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇ రమణమూర్తి, నారాయణరావు, కిరణ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

సంక్షిప్త వార్తలు

రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు భరోసా

పోస్టర్‌ను అందజేస్తున్న లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర భవిష్యత్‌కు భరోసా చంద్రబాబు అని, అభివృద్ధి, సంక్షేమమే టిడిపి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని చేపల మార్కెట్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన కాలంలో చంద్రబాబు పాలనలో చేసిన అభివృద్ధిని చూపిస్తూ... పోస్టర్లను అందజేశారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిసి రాష్ట్ర భవిష్యత్‌కు పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిల్లా శ్రీనివాసరావు, డివిజన్ ఇన్‌ఛార్జి సురకాసి వెంకటరావు, నియోజకవర్గం బిసిసెల్ కార్యదర్శి మడ్డి అప్పలరాజు, నగర తెలుగు యువత ఉపాధ్యక్షులు శిల్లా సురేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు, మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ

బూర్జ : గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కె.గోవిందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా వంట సామగ్రిని గురువారం అందజేశారు. ఎంఇఒ ఎస్.శ్యామసుందర మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యలను ఆధారంగా వంటలను ఆరు కేటగిరీలుగా విభజించామని అన్నారు. అన్ని పాఠశాలలకు స్టీల్ టబ్బులు, బేసిన్లు, కురిపి, కలాయి, హస్తాలను అందించామని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నెన నాగేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, విశ్రాంత జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఐ.వెంకటరావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ ఎస్.రమణారావు, ఎంఇఒ-2 బి.ధనుంజయరావు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం తనిఖీ

రికార్డులను తనిఖీ చేస్తున్న కుమారరాజు

టెక్కలి రూరల్: టెక్కలిలోని శంభాన వీధిలో ఉన్న శాఖాగ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార రాజు గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయంలో పుస్తక నిల్వలను, సంబంధిత దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నెలవారీ ధరావత్తుదారుల సంఖ్య పెంపొందించేందుకు కృషి చేయాలని గ్రంథాలయాధికారి బి.రూపావతికి సూచించారు.

భావి తరాలకు ఇచ్చే ఆస్తి మొక్కలే

పలాస : భవిష్యత్ తరాలకు మనమిచ్చే నిజమైన ఆస్తులు మొక్కలేనని, ఆరోగ్యకరమైన వాతావరణానికి మొక్కలు చాలా అవసరమని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, డాక్టర్ ప్రశాంతి అన్నారు. మండలంలోని రెంటికోటలో గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన బాదం, కదంబ, కియో కార్పస్, వేప తదితరులు మొక్కలను రోడ్లకు ఇరువైపులా నాటారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, రిషికేశ్వరరావు, కామేశ్వర రావు, శ్యామలాదేవి, చిన్నారావు, రాజేశ్వరి అనూష, ధనలక్ష్మి రోషా, భారతి, యోగి, పాల్గొన్నారు.

రణస్థలం : బాల్య దశ నుంచిఏ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలనిహరిత సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని లొడగలపేటకు చెందిన లొడగల గోవింద కుమారుడు లొడగల రవి, యడ్ల రమణ కుమారుడు గీతాన్ష్‌ల పుట్టిన రోజు సందర్భంగా స్థానిక అయ్యప్ప సన్నిధానం ఆవరణలో గురుస్వామి చిల్ల వెంకటరెడ్డి ఆధ్వర్యాన ఉసిరి, మారేడు, బాదం, వేప, రావి తురాయి వంటి మొక్కలను నాటారు. హరిత సంస్థ సభ్యులు కె.మనోజ్‌కుమార్, జె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎన్‌సిసికి 48 మంది బాలికలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 48 మంది బాలికలకు ఎన్‌సిసిలో తొలిసారి చోటు కల్పించామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. 14 బెటాలియన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ క్యాడెట్లను సుభేదార్లు బి.ఎస్.రావు, రవికుమార్‌లు వీరికి గురువారం ఎన్‌రోల్‌మెంట్ ఇచ్చారని అన్నారు. వాణిజ్య విభాగం అధ్యపకులు పావని, చరిత్ర విభాగం అధ్యాపకులు వరలక్ష్మిలను సీనియర్ వింగ్ కేర్ టేకర్లుగా నియమించినట్లు చెప్పారు. ఎన్‌సిసి అధికారి పోలినాయుడు పర్యవేక్షణలో వీరు శిక్షణ పొందుతారని తెలిపారు.

నగదు రహిత లావాదేవీలు సురక్షితం

పొందూరు: నగదురహిత లావాదేవీలు సురక్షితమని డిసిసిబి మేనేజర్ కిషోర్ అన్నారు. మండలంలోని లైదాంలో పొందూరు డిసిసిబి ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసిబి ద్వారా అందజేస్తున్న సేవలను, రైతులకు రుణాలను, బంగారం రుణాలపై వివరించారు. సిఇఒ ఎర్నేన పాపినాయుడు, సర్పంచ్ అనంతరామకృష్ణ పాల్గొన్నారు.

అటెండర్‌కు సన్మానం

నందిగాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాత్కాలిక అటెండర్‌గా 30 ఏళ్ల పాటు కల్లేపల్లి విశ్వనాథంను గురువారం సన్మానించారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో స్వచ్ఛంగా విధుల నుంచి తప్పికుని శ్రీకాకుళంలో నివాసముంటున్నారు. 30 ఏళ్ల సేవలు అందించినందుకు మండల పరిషత్ అధ్యక్షులు ఎన్.శ్రీరామ్మూర్తి, జెసిఎస్ జె.జయరాంలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు దుశ్శాలువలు కప్పి సన్మానించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

రణస్థలం : మండలంలోని నగరంపాలెం సచివాలయం వద్ద నిర్వహించిన జనగన్న ఆరోగ్య సురక్షను ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ సందర్శించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సంపూర్ణ పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, మండల ఎఒ ధనుంజయరావు, డాక్టర్లు సుమన్, కృష్ణచైతన్య, పంచాయతీ సెక్రటరీ చెంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులు డి.నీరజ, మనీష, ప్రీతి, జోత్న్స, సురేష్, నితీష్‌కుమార్‌లు 391 మంది పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పొందూరు: మండలంలో దల్లవలసలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన జగనన్న ఆరోగ్య సురక్షను నిర్వహించారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలోని 348 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కిల్లాన తిరుమలరావు, ఎంపిటిసి కిల్లాన సూర్యారావు, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, చిన్నంనాయుడు, వైద్యాదికారులు మల్లీశ్వరమ్మ, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఎం, సిఎసి ద్వితీయ ఏడాది బిటెక్ కోర్సులకు చెందిన 216 మంది విద్యార్థులకు అక్టోబరు 9 నుంచి నంబరు 4 వరకు ఎపిఎస్‌ఎస్‌ఎసి సిఎంస్, ఎక్స్పెన్ ల్యాబ్లో 'వెబ్ డెవలప్మెంట్ యూజింగ్ డిజంగో' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. డిజంగో ఇంట్రడక్షన్స్, యుఆర్, ఎల్ఎస్ క్రియేషన్, స్టేటిక్ యుఆర్ఎస్ఎస్, డైనమిక్ యుఆర్ఎస్ఎస్, డిజంగో టెంపలేట్స్, స్టేటిక్ ఫైల్ హేండ్లింగ్, బూట్స్, క్రూడ్ ఆపరేషన్స్, ఓఆర్ఎం క్వరీస్ వంటి అంశాలపై టి.శ్రీకన్య శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్ఎం, సిఎసి హెచ్చిడి డాక్టర్ ఎం.వి.బి.చంద్రశేఖర్, ఎపిఎస్ఎస్ఎసి స్పాక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్, శాఖ కో-ఆర్డినేటర్లు కె.సంగీత, కె.బి.అనూషలు పర్యవేక్షించారన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పలాస : విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుదామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్ అన్నారు. పలాస పిడిఎస్‌యు కార్యాలయంలో డిసెంబరు 15, 16, 17 తేదీల్లో నెల్లూరు నగరంలో నిర్వహిస్తునున్న రాష్ట్ర మహాసభల పోస్టరును గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయవద్దని డిమాండ్ చేశారు. రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి మణిహారమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటు చేయవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబరు 77 తీసుకువచ్చి ఉన్నత విద్యకు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు దూరం చేసే కుట్రను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. విజయ్, రవి, సునీల్, జీవన్ పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడుకు ఘన నివాళి

కోటబొమ్మాళి : నివాళర్పిస్తున్న అచ్చెన్న, రామ్మోహన్ నాయుడు

కేంద్ర మాజీ మంత్రి కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు 11వ వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. మండల కేంద్రాల్లో టిడిపి నాయకులు ఎర్రన్నాయుడు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొని నివాళ్లర్పించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం ఎర్రన్న జవాన్ మిత్రను ఎంపీ ఆవిష్కరించారు. జిల్లా సైనిక ఉద్యోగుల సంఘం, సైనిక వెల్ఫేర్ బోర్డు ఆధ్వర్యాన గుర్తించిన 20 మంది అమర జవాన్ కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు.

- విలేకరుల యంత్రాంగం, ప్రజాశక్తి

శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కవిటి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పోలాకి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

టెక్కలి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

మెళియాపుట్టి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సంతబొమ్మాళి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు